నాటి కృషి.. నేటి ఫలితం

- రూ. కోటి దాటిన నేత్రప్రదాయిని క్షేత్ర వార్షికాదాయం
- 10 నుంచి 12కు పెరిగిన దేశమ్మ ఆలయ కమిటీ సభ్యుల సంఖ్య
- పూర్తయిన నూతన కమిటీ నియామకం



నేత్రప్రదాయిని దేశమ్మ దేవత ఆలయం

నగరి: చారిత్రక ప్రసిద్ధిగాంచిన నేత్రప్రదాయిని క్షేత్రమైన దేశమ్మ దేవాలయ అభివృద్ధిపై మాజీ మంత్రి ఆర్కేరోజా చూపిన కృషి నేడు సత్ఫలితాలను ఇస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జూలై 2022–మార్చి 2024 మధ్య కాలంలో నేత్రప్రదాయిని క్షేత్రం పునర్నిర్మితమైంది. 154 ఏళ్ల అనంతరం శిథిలావస్థలో ఉన్న దేశమ్మ దేవత ఆలయాన్ని మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రత్యేక చొరవ తీసుకొని రూ.2.40 కోట్లు దేవదాయ శాఖ ద్వారా, తుడా నిధులతో రూ.45 లక్షలు మంజూరు చేయించడంతోపాటు, దాతల ద్వారా రూ.80 లక్షలు సమకూర్చి ఆలయాన్ని అత్యద్భుతంగా పునర్నిర్మించారు. ఆలయ నిర్మాణంతో పాటు పరివార దేవతలైన వినాయక, సుబ్రమణ్య, నాగదేవత ఆలయాలు, ఆర్‌ఓ వాటర్ ప్లాంటు, భక్తులకు తగిన విధంగా మరుగుదొడ్లు, మినీ కళ్యాణమండపం, నవగ్రహ మండపం, పొంగళ్ల మండపం, పాదాల మండపం, విడిది గదులు, కల్యాణ కట్ట తదితర సదుపాయాలు సమకూర్చారు. టీటీడీ నుంచి శ్వేత వస్త్రాలు అందించే ఏర్పాటు చేశారు. అప్పటి పాలక మండలి సభ్యులు మాజీ మంత్రి సూచనల మేరకు ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీంతో దేదీప్యమానంగా దేశమ్మ ఆలయం నిర్మించబడింది. ఇంతింతై వటుడింతై అన్నట్లు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య క్రమేణా పెరిగింది. మాజీ మంత్రి సూచనలతో గత కమిటీ నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో చేపట్టిన పలు కార్యక్రమాలతో ఆలయం నిత్యం భక్తులతో కళకళలాడింది. ఫలితం ఆలయానికి వచ్చే వార్షిక ఆదాయం రూ.70 లక్షల నుంచి రూ.కోటి దాటింది. దీంతో ఆలయానికి నిధులు పెరగడంతోపాటు నిధులకు తగిన మేర దేవదాయ శాఖ నిబంధనలను అనుసరించి కమిటీ సభ్యుల పోస్టు రెండు అదనంగా మంజూరైంది. గతంలో ఎనిమిది మంది సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, దాత అంటూ పదిమంది కమిటీలో ఉండేవారు. నేడు సభ్యుల పోస్టులే పదికి పెరిగింది. ఈ మేరకు నూతన కమిటీని ప్రస్తుత ప్రభుత్వం నియమించింది.

నేత్రప్రదాయిని ఇచ్చిన అవకాశం



నేను ఆలయ కమిటీ చైర్మన్‌గా ఉన్న కాలంలో ఆలయ పునర్నిర్మాణం జరగడం నా అదృష్టం. ఇదంతా మాజీ మంత్రి ఆర్కే రోజమ్మ తీసుకున్న ప్రత్యేక శ్రద్ధతోనే సాధ్యమైంది. కృతనిశ్చయంతో ఆమె ఈ మహత్కార్యానికి పూనుకున్నారు. ఆమె వెంట మేము నడిచాం భక్తిశ్రద్ధలతో ఆలయాన్ని అభివృద్ధి చేయగలిగాం. రూ.60 నుంచి రూ.70 లక్షలు వస్తున్న ఆలయ వార్షిక ఆదాయం రూ.కోటికి పైగా చేరింది. దాని ఫలితమే నేడు అదనంగా ఇద్దరు సభ్యులు పెరిగారు. నూతన కమిటీ భక్తిశ్రద్ధలతో ఆలయాన్ని అభివృద్ధి పథంలోనే నడిపిస్తుందని ఆశిస్తున్నా.

– వేణుబాబు, దేశమ్మ దేవాలయ మాజీ చైర్మన్

క్లుప్తంగా

మాజీ సీఎంతో నేతల సమావేశం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మి

గంగాధరనెల్లూరు: విజయవాడలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయాలపై అధినేతతో సుదీర్ఘంగా చర్చించారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన



నిరసన చేస్తున్న ఆదిఆంధ్రవాడ గ్రామస్తులు

పాలసముద్రం: మండలంలోని దీనబంధుపురం సమీపంలోని ఆదిఆంధ్రవాడకు గ్రామస్తులు నిత్యం వెళ్లుతున్న రోడ్డు బాగు చేయాలని గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తులు నిరసన చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షానికి గ్రామానికి వెళ్తున్న రోడ్డు గుల్లలు తేలిపోయిందని, వాగులు వాగులుగా కోతలకు గురైందని తెలిపారు. రోడ్డు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్డుని మరమ్మతు చేయాలని అధికారుల వద్దకు తిరిగినా ఫలితం లేదని వాపోయారు. పాఠశాలకు విద్యార్థులు రోడ్డుపై వెళ్లాలంటే అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనంలో కింద పడాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ సతీష్ వారం రోజుల్లో రోడ్డు పనులు మరమ్మతు చేస్తామని నిరసన చేస్తున్న వారికి చెప్పడంతో ఆందోళన విరమించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

నగరి: ఏరియా ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి జ్యోతి ప్రజ్వలనచేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తపోటు, మధుమేహం, నోటిక్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు వైద్యచికిత్సను అందించారు. అబా కింద 243 మంది, స్త్రీ సమస్యలతో 103 మంది, చిన్నపిల్లలు 6, అనిమియాతో 92, ఎన్‌సీబీ 5, డయాబెటిస్ 8, ఈఎన్‌టీ 29 మంది, సాధారణ వ్యాధులతో 61 మంది చికిత్స అందుకున్నారు. ముగ్గురు రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఆర్‌ఎంఓ డాక్టర్ ఆర్‌వీ మంజుల, వైద్యులు కార్తికేయన్, జరీనా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

వెదురుకుప్పం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణచైతన్య అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా గ్రామీణ రోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చాణక్య, హనుమంతరెడ్డి, సామాజిక కార్యకర్త కిషన్, ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

32 మందికి ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

పుత్తూరు: పట్టణ పరిధి గోవిందపాళెంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 32 మంది ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఉమామహేశ్వర్ తెలిపారు. బెంగళూరుకు చెందిన గ్లోలాజిక్స్ సొల్యూషన్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిర్వహించిన డ్రైవ్‌లో 110 మంది పాల్గొనగా 32 మంది ఎంపికైనట్లు వెల్లడించారు.

హామీల అమలులో కూటమి విఫలం



ఎంపీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మంజు బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

- వెన్నుపోటు రాజకీయంలో చంద్రబాబు దిట్ట
- రానున్న స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం
- ఎంపీపీగా మంజు బాలాజీ బాధ్యతల స్వీకరణ

విజయపురం: హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. విజయపురం ఎంపీపీ జమున అనారోగ్యం కారణంగా రాజీనామా చేయడంతో మంజు బాలాజీ ఎంపీపీగా జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందుకొన్నారు. ఈమేరకు గురు వారం ఏర్పాటు చేసిన ఎంపీపీ బాధ్యత స్వీకరణ మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని, సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అడ్డదారిలో అధికారం చేపట్టిందని, అందుకే ప్రజల్లోకి రావడానికి భయపడుతున్నారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తున్నా పార్టీ నాయకులు, కార్యకర్తలు బలంగా ఉన్నారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజలు అన్నిటికీ క్యూ కడుతున్నారని, పింఛన్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. వెన్నుపోటు రాజకీయం చేయడంతో చంద్రబాబుకు మించిన నాయకుడు ఈ ప్రపంచంలో ఎవ్వరు లేరన్నారు. నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మన పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు.

పదవికి న్యాయం చేస్తా..

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా తమకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానని, నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకు అతీతంగా పని చేస్తానని ఎంపీపీ బాలాజీ అన్నారు. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తానని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయ సాధనకు కృషి చేస్తానన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుణశేఖర్‌రెడ్డి, గోవర్ధన్ నాయుడు, శేఖర్‌రాజు, మండల కన్వీనర్ శివరాజు, బూత్ కన్వీనర్ ప్రసన్న, రామకృష్ణమరాజు, నాయకులు ఆనంద్, కుమార్‌రెడ్డి, జిల్లు, భాస్కర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, అరుణాచలం, నిండ్ర ఎంపీపీ దీప, నగరి జెడ్పీటీసీ గాంధీ, మున్సిపాల్ హరి, లక్ష్మణమూర్తి, అన్నలోకనాథం, ధర్మయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుమలరెడ్డిని పరామర్శిస్తున్న మాజీమంత్రి ఆర్కేరోజా

బాధితులకు పరామర్శ

నగరి: అనారోగ్యం పాలై చికిత్స అందుకుంటున్న వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డిని మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. గురువారం నంబాకం గ్రామంలోని తిరుమలరెడ్డి స్వగృహానికి వెళ్లిన ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. బుగ్గఅగ్రహారం గ్రామంలో అనారోగ్యం పాలైన వైఎస్సార్ సీపీ కార్యదర్శి సిల్వర్ భాయ్ భార్య రంజాన్‌ను పరామర్శించి భరోసా ఇచ్చారు. ఆమె వెంట ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీలు గుణశేఖర్‌రెడ్డి, యేసు, పార్టీ నాయకులు బుజ్జిరెడ్డి, కుమారస్వామి, దస్తగిర్, భాస్కర్ రెడ్డి, రవికుమార్, హరి, ఎల్లప్పరెడ్డి, దినకర్ రెడ్డి, ఏలుమలై రెడ్డి, సుబ్రమణ్యం, మురుగ, ఆనంద్‌కుమార్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న మేనేజర్ ఆదినారాయణ స్వామి

పుత్తూరు: సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని, తద్వారా మంచి లాభాలను ఆర్జించవచ్చునని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దివ్య సూచించారు. గురువారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ ఆధునిక సాంకేతిక పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దివ్య మాట్లాడుతూ ప్రధానంగా భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి ఎరువులు వినియోగించాలని సూచించారు. మద్రాస్ ఫర్టిలైజర్స్ రీజనల్ చీఫ్ మేనేజర్ ఆదినారాయణస్వామి మాట్లాడుతూ ఇష్టానుసారం ఎరువులు వినియోగిస్తే నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. తగిన మోతాదులో సేంద్రియ ఎరువులను వాడడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. రైతు సంఘాలకు రూ.24 లక్షల రుణాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కోదండయ్య, అధికారులు రమేష్, రవి, ప్రకాష్, శేఖర్, పుత్తూరు, నగరి మండలాల రైతులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యం దేశానికి ముఖ్యం



మాట్లాడుతున్న వైద్యాధికారులు మోహన్‌క్రిష్ణ, జయకుమార్

పాలసముద్రం: ప్రతి ఇంట్లో మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, జయకుమార్ తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్ గాలి మహేష్ సమక్షంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. వైద్య పరీక్షలకు వచ్చిన వారితో డాక్టర్లు మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మహిళ ప్రసూతి, చిన్న పిల్లల ఆరోగ్యం, చెవి, ముక్కు, గొంతు, కంటి, దంత వైద్య పరీక్షలతో పాటు మహిళలకు టీబీ, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్ ప్రదర్శించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్రమణి, సూపర్‌వైజర్ శుభలక్ష్మి, ఏఎన్‌ఎం రాణి, జయలక్ష్మి, గంగాగౌరి, లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, శిరీష, లావణ్య, నిర్మల, మైనా, 104 డీఈఓ శరవణన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దీనదయాళ్ జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు: సంఘ సంస్కర్త, అర్థశాస్త్రవేత్త అయిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా బీజేపీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి కె.బాబు పిలుపునిచ్చారు. గురువారం పండిట్ దీన్‌దయాళ్ జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలకు ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహానుభావుడని అభివర్ణించారు. అనంతరం ఆయన చిత్రపటంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జైగిరిప్రసాద్, చెన్నకేశవ, నగరి కన్వీనర్ హరిబాబు, నాయకులు శ్రీనివాసరెడ్డి, మహాదేవరాయులు, శేఖర్, ఆర్ముగం, రామ్మూర్తి, చెంగల్‌రాయలు, నాగరాజు, సుధాకర్, సుధీర్, కుప్పయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించండి



ఎంపీడీఓ చంద్రమౌళి

కార్వేటినగరం: జాతీయ రహదారిపై దుకాణాలకు అనుకూలంగా నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో మండపంవీధి, బజారు వీధుల్లో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ మాసంలో షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభం కానుందని, దీంతో చెరకు ట్రాక్టర్లు రాకపోకలతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారే అవకాశం ఉందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలు చోటు చేసుకోక ముందే ప్రజలే సహకరించి రోడ్లపై అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించుకోవాలన్నారు. దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా చూడాలన్నారు. ప్రతిఏటా ట్రాఫిక్ ఇబ్బందులతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. వాహన చోదకులు సురక్షిత ప్రయాణానికి ప్రజలు సహకరించాలన్నారు.

నిత్యానందకరి నమామి..



నవరాత్రి పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా

మాజీ మంత్రి ఆర్కేరోజా నవరాత్రి పూజలు

మాజీ మంత్రి ఆర్కే రోజా దసరా ఉత్సవాల్లో భాగంగా ఆమె స్వగృహంలో కాత్యాయని దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. అందరికీ శుభం కలగాలని వేడుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లు

నగరి: నియోజకవర్గంలోని దేవీ ఆలయాలు గురువారం పూజా కార్యక్రమాలతో హోరెత్తాయి. నేత్రప్రదాయిని దేశమ్మ దేవత త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పట్టణ పరిధిలోని కరకతేశ్వరాలయంలో నవరాత్రి పూజల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షి దేవికి బాలత్రిపురసుందరి అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూష్మాండదుర్గ అలంకారం చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దర్శించుకున్నారు. అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అఖండ దీపపు పూజ నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. గ్రామదేవత సామాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విభూది అలంకరణ చేయగా పలువురు భక్తులు దర్శించుకున్నారు.

సంతానలక్ష్మిగా అల్లియల్లమ్మ

గంగాధరనెల్లూరు: శ్రీఅల్లియల్లమ్మ తల్లి దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మూడో రోజు సంతాన లక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూల ఉత్సవమూర్తులకు ఉదయం ఆలయ అర్చకులు ఆనంద అయ్యంగార్ ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ఆలయ మాడవీధులలో ఓం శక్తి నామస్మరణతో పంబల వాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా గంగాధరనెల్లూరుకు చెందిన పద్మావతి తంగవేల్ నాడార్ , పెరుమాళ్ అన్నదమ్ముల కుటుంబ సభ్యులు సంయుక్తంగా 450 మందికి అన్నదానం నిర్వహించారు.

కాత్యాయనిగా రాజరాజేశ్వరి అమ్మవారు

వెదురుకుప్పం: డీఆర్‌ఎన్‌కండ్రిగ గ్రామ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. అంతకు ముందు అమ్మవారికి భక్తిప్రపత్తులతో అభిషేకాలు చేశారు. తదుపరి వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా ముస్తాబు చేసి, విశేష పూజలు చేపట్టారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అన్నపూర్ణగా మహాలక్ష్మమ్మ

నిండ్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

వైష్ణవీదేవీగా బంగారమ్మ తల్లి

కార్వేటినగరం: శర్నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా మూడో రోజు గురు వారం శ్రీబంగారమ్మ వైష్ణవీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కె.ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి కె.ఎం.చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

స్కంధ పుష్కరిణీ సమీపంలో వెలసి ఉన్న శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కొల్లాగుంట సమీపంలో వెలసి ఉన్న శ్రీపడివేటమ్మ ఆలయం, ఆలత్తూరు గ్రామ సమీంలో వెలసి ఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయం, పాదిరికుప్పం గ్రామంలోని గంగమ్మ ఆలయం, డైట్ సమీపంలోని శ్రీఅంకాళపరమేశ్వరీ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

విశేష అలంకరణలో అమ్మవార్లు

పుత్తూరు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కామాక్షీదేవిని లక్ష్మీదేవిగా, ద్రౌపదీదేవి, ఆరేటమ్మలను అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు.

హిందీ అనుసంధాన భాష



బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

పుత్తూరు: దేశంలోని అన్ని ప్రాంతాల వారిని కలిపే జాతీయ భాష హిందీ అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి అన్నారు. గురువారం కళాశాలలో హిందీ భాషా విశిష్టత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందీ భాష భారతీయ సంస్కృతికి ప్రతిబింబమన్నారు. త్రిభాషా సూత్రం ప్రకారం తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు హిందీ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని కోరారు. వివిధ అంశాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హిందీ విభాగం అధిపతి వాణిశ్రీ, వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు నరసింహులు, వెంకటేశన్, శ్రీదేవి, తిరుమలయ్య, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నగరి: మెప్మా కార్యాలయంలో గురువారం పీఎం స్వనిధి 2.0 లోక కళ్యాణ్ మేళా పథకంలో వీధి వ్యాపారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మెప్మా అధ్యక్షతన 200 మంది వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు, చిరు వ్యాపారులకు 2.0 లోక కళ్యాణ్ మేళా పథకం ద్వారా రూ.15వేలు నుండి రూ.50 వేల వరకు రుణాలు ఇస్తామన్నారు. తొలి విడతలో రూ.10వేల నుంచి 15వేలు, రెండో విడతలో రూ.20 వేల నుండి రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేల వరకు రుణాలు అందజేస్తామన్నారు. అర్హులైన వీధి విక్రయదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలకు దరఖాస్తులు చెసుకోదలచిన వారు మెప్మా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వీధి విక్రయదారులు పట్టణంలో ప్రత్యేక వెండింగ్ జోన్‌లు ఏర్పాటు చేసి అందులోనే వ్యాపారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏకాంబరకుప్పం ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, లేబర్ డిపార్టుమెంట్ సిబ్బంది, ఫోన్‌పే అగ్రిగేటర్స్ సోము, పవన్, మెప్మా సిటీ మేనేజర్ ఎస్ ప్రసాద్, మెప్మా రిసోర్స్ పర్సన్లు, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కులో పారిశుధ్య పనులు



పార్కులో శుభ్రత పనులు

నగరి: ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ అనే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది పట్టణ పరిధిలోని పార్కును శుభ్రపరిచారు. గురువారం పార్కులోనికి చేరుకున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సిబ్బంది శ్రమదానంతో పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలను తొలగించి పార్కును శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పురప్రజలు చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి పురపాలక సిబ్బందికే అందించాలని, రోడ్లు, కాలువల్లో చెత్త వేయరాదన్నారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి పెను ముప్పు ఉందని, వాటి వలన మానవ మనుగడకే హాని కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో గుడ్డ లేదా నారుతో చేసిన సంచులు వాడాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.